



# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190






ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :187 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ శుక్రవారం- 07 - ఆగస్టు - 2026


## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి



- పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్రం
- ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం
- ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు
- పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం
- సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరని సూచన
- వివాదాల తర్వాతే కొత్త దరఖాస్తు పంపాలని హితవు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల మిగతా..2లో

## హైదరాబాద్ వాసులకు చల్లని కబురు.. శనివారం వరకు వర్షాలు



- హైదరాబాద్‌లో శనివారం వరకు ఉరుములతో కూడిన వర్షాలు
- ప్రస్తుతం 12 శాతంగా ఉన్న వర్షపాతం లోటు తగ్గే అవకాశం
- తెలంగాణ వ్యాప్తంగా సాధారణ స్థాయిలోనే వర్షపాతం నమోదు
- కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా అదనపు వర్షపాతం

హైదరాబాద్: హైదరాబాద్‌వాసులకు భారత వాతావరణ శాఖ ఊరటనిచ్చే వార్త అందించింది. శనివారం వరకు హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలుల వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వర్షాలతో నగరంలో ప్రస్తుతం నెలకొన్న వర్షపాతం లోటు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు హైదరాబాద్‌లో మిగతా..2లో

## రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు: హరీశ్ రావు




- తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారన్న హరీశ్
- కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య
- గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు

హైదరాబాద్: సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని...

## తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు.. ఆగస్టు 15న
# రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

- సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం
- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో మిగతా..2లో

## అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తా




- సామాజిక న్యాయ తెలంగాణను తీర్చాదిద్దాడానికి ముందున్నామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత తెలిపారు
- ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకు సామాజిక న్యాయం కోసం పాటుపడలేదని విమర్శించారు.

హైదరాబాద్, ఆగస్టు 6: సామాజిక న్యాయ తెలంగాణను తీర్చాదిద్దాడానికి ముందున్నామని టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఈరోజు(గురువారం) సరూర్ నగర్‌లో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో మాట్లాడుతూ.. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకు సామాజిక న్యాయం కోసం పాటుపడలేదని విమర్శించారు. ఈ సభ తెలంగాణలో కొత్త చరిత్రకు నాంది పలుకుతుందని, అనేక మంది జీవితాల్లో మార్పు తీసుకురానుందని వెల్లడించారు.

## నీట్ లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి- ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షపై సమాలోచనలు




- నీట్-యూజీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహణపై సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్
- నీట్ యూజీ పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సన్నాహాలు

ఢిల్లీ : దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-యూజీ పరీక్ష నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఉన్న పెన్-అండ్-పేపర్ విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షగా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఎన్టీఏ స్థానంలో స్వతంత్ర, బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న పిటిషన్లపై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు
# విధించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం


- ఛార్జీలు విధించే అధికారం బ్యాంకులకు ఇచ్చేందుకు లోక్‌సభ ఆమోదం
- పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్-2007 చట్ట సవరణకు లోక్‌సభ ఆమోదం
- చర్చ లేకుండానే యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు ఆమోదం



ఢిల్లీ : ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ ఎలాంటి చర్చ లేకుండానే గురువారం పలు బిల్లులను ఆమోదించింది. ముఖ్యంగా యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఛార్జీలు విధించే అధికారం బ్యాంకులకు ఇచ్చేందుకు తీసుకువచ్చిన పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్-2007 చట్ట సవరణను లోక్‌సభ ఆమోదించింది. అనంతరం శుక్రవారానికి వాయిదాపడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అయోధ్య రామమందిరంలో కానుకల చోరీ, విద్యార్థులపై పోలీసు చర్య అంశాలపై మిగతా..2లో

## విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యకు
# అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలి

- తాము లేవనెత్తిన ఆందోళనలపై ప్రభుత్వం స్పందించాలన్న ఖర్గే
- 'ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమం అంటే యంత్రాంగానికి ఎందుకు అంత భయమో' అంటూ ప్రియాంక విమర్శ



ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. జులై 20న విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, అయితే తాము లేవనెత్తిన ఆందోళనలపై ప్రభుత్వం స్పందించాలని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై హోంమంత్రి సభకు వచ్చి మాట్లాడేలా చూడాలని రాజ్యసభ చైర్మన్ స్వయంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించాలని ఖర్గే పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. "శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్‌ల ఉపయోగించమని ఎవరు ఆదేశాలు ఇచ్చారో మిగతా..2లో

## పరామర్శల పేరుతో జగన్ విధ్వంసం, అరాచకం సృష్టిస్తున్నారు




- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమరావతి, ఆగస్టు 6 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి పరామర్శల పేరుతో జగన్ సృష్టించిన విధ్వంసాన్ని వివరిస్తూ మీడియాకు అనిత ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయన పర్యటనల్లో సృష్టించిన అరాచకాల వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. తన రాజకీయం కోసం పేదలను గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు.

# ఏపీ పీపీపీ పాలసీ
# 2026 ముసాయిదాకు ఆమోదం

## కేబినెట్ కీలక నిర్ణయాలివే

- మూడున్నర గంటలకు పైగా జరిగిన మంత్రివర్గ సమావేశం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్2026కు గ్రీన్ సిగ్నల్
- ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాకు ఆమోదం



అమరావతి : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణంలో వేగం, పారిశ్రామిక ప్రోత్సాహకాలు తదితర అంశాలు ప్రధాన అజెండాగా ఏపీ మంత్రివర్గ సమావేశం జరిగింది. అమరావతి నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే కొత్త చట్టాలతో పాటు పెండింగ్ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. విద్యా, వైద్య రంగాలు సహా రహదారి భద్రత, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చింది. మిగతా..2లో

## ఎన్నికలకు సిద్ధంకండి.. ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు ఉండండి

### మంత్రులకు నారా లోకేశ్ సూచన



- స్థానిక ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయన్న నారా లోకేశ్
- భారీ విజయం లక్ష్యంతో క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచన
- ఎల్-నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్న లోకేశ్

అమరావతి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలపై మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఎన్నికలకు సిద్ధంకండి.. ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు ఉండండి

తన సహచర మంత్రులకు నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. స్థానిక పోరు అనుకున్న సమయానికే జరుగుతుందని స్పష్టం చేసిన లోకేశ్, కూటమి అభ్యర్థుల భారీ విజయానికి పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయికి వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా నాయకులు ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలైనా గడిపి, వైసీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని, కూటమి ప్రభుత్వం తెచ్చిన సంక్షేమాన్ని క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఈ ఉదయం మంత్రులతో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు సూచించారు. ఇదే సమావేశంలో అసెంబ్లీ వ్యూహంపైనా చర్చించారు. రాష్ట్రంలో ఉన్న ఎల్-నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. జలాశయాల్లోకి నీరు చేరుతుండటం కొంత ఊరటనిచ్చినప్పటికీ... ప్రభుత్వం వైపు నుంచి తొలి ప్రాధాన్యత తాగునీటి సరఫరాకే ఇవ్వాలని, ఆ తర్వాత పశు గ్రాస కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభను సరైన వేదికగా మలుచుకోవాలని మంత్రులకు పిలుపునిచ్చారు.

## తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు.. ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విపక్షాల నినాదాలతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టకుండానే స్పీకర్ సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సభలో అదే పరిస్థితి కొనసాగింది. అయితే విపక్షాల నినాదాల మధ్యే ట్యాక్సేషన్, ఇతర చట్ట సవరణ బిల్లును మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్ట సవరణ బిల్లునూ కూడా ఆమోదించింది. యూపీఐ, రూపే లావాదేవీలపై జీరో-వీణ= విధానానికి చట్టపరమైన వెసులుబాటు కల్పించడంతోపాటు ఏ డిజిటల్ చెల్లింపులు ఉచితంగా ఉండాలో నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే అధికారం కేంద్రానికి ఈ బిల్లు ద్వారా సంక్రమించనుంది. అనంతరం లోక్‌సభ శుక్రవారానికి వాయిదాపడింది.

## నీట్ లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి- ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షపై సమాలోచనలు

ఈ నేపథ్యంలో నీట్-యూజీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహణపై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్రం పలు విషయాలను ప్రస్తావించింది. జేఈఈ తరహాలో నీట్ నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. నందన్ నీలేకని అధ్యక్షతన ఏర్పాటైన హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగానే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. కంప్యూటర్ ఆధారిత విధానంలోకి మారితే దానిని వీలైనంత త్వరగా అమలు చేయాలని వైద్యుల సంఘం తరపున పిటిషనర్లు కోర్టును కోరారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు. అయితే కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై సమాధానం ఇవ్వాలని వైద్యుల సంఘంతో సహా పిటిషనర్లను సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

### హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగానే తుది నిర్ణయమన్న కేంద్రం

"నీట్ విషయంలో పెన్ -పేపర్ విధానం నుంచి కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే అంశంపై ప్రస్తుతం సంబంధిత వర్గాలన్నీ చురుగ్గా పరిశీలన జరుపుతున్నాయి. ఇది జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (మెయిన్స్ -అడ్వాన్స్‌డ్ తరహాలో ఒకే దశలో లేదా రెండు దశల్లో ఉండవచ్చు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది విధానాన్ని అనుసరిస్తాం. సాంకేతికత, అంతరిక్షం, ఇంటెలిజెన్స్, విద్యా రంగం, ప్రజా పరిపాలన వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన నిపుణులతో కూడిన ఈ టాస్క్ ఫోర్స్, విధాన మార్పునకు సంబంధించిన సాంకేతిక, భద్రతా, సమానత్వ, మౌలిక సదుపాయాలు, బోధనాపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తుంది." అని కేంద్రం అఫిడవిట్ లో పేర్కొంది. ప్రశ్నపత్రాల లీకులు, వ్యవస్థాగత వైఫల్యాలను నిర్మూలించేందుకు జాతీయ అర్హత-ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ప్రశ్నాపత్రాల లీకులు, నకిలీ గుర్తింపు, కంప్యూటర్ వ్యవస్థలను తారుమారు చేయడం, ఇతర పరీక్షా సంబంధిత నేరాలను నేరంగా పరిగణించే 2024 చట్టాన్ని విస్తరిస్తూ, పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం- 2026 తీసుకువచ్చామని కేంద్రం చెప్పింది. ఈ చట్టం ద్వారా పరీక్షల మోసానికి వ్యతిరేకంగా పార్లమెంటు చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేసిందని కేంద్రం తెలిపింది.


### ముందే స్పష్టత ఇవ్వాలని ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేసిన వైద్యుల సంఘం

అటు ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తరపున న్యాయవాది తన్వి దూబే ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఒకవేళ కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే ప్రణాళిక ఉంటే, అది వీలైనంత త్వరగా జరగాలని ఆమె కోరారు. ఎందుకంటే ప్రస్తుతం విద్యార్థుల సన్నద్ధత పెన్- పేపర్ విధానం ఆధారంగానే సాగుతోందని తెలిపారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన ధర్మాసనం, సంబంధిత పక్షాలను తమ సమాధానాలు, సూచనలను దాఖలు చేయాలని చెప్పింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో సంస్కరణలు కోరుతూ =జీణ ఎంపీ సుధాకర్ సింగ్ తరపున సీనియర్ న్యాయవాది పిజుష్ కాంతి రాయ్, న్యాయవాది సత్యం సింగ్ రాజ్‌పుత్ హాజరయ్యారు.

## రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు: హరీశ్ రావు

రేవంత్ ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని విమర్శించారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ వాసులకు చల్లని కబురు..



## శనివారం వరకు వర్షాలు

సాధారణంగా 313.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ, కేవలం 277.3 మి.మీ. మేర మాత్రమే కురిసింది. దీనివల్ల సుమారు 12 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. రాబోయే వర్షాలతో ఈ లోటు భర్తీ కావడంతో పాటు, రాష్ట్రంలోని జలాశయాల నీటి మట్టాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం దాదాపు సాధారణ స్థితిలోనే ఉంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 402.1 మి.మీ. కాగా, ఇప్పటివరకు 379 మి.మీ. నమోదైంది. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 581 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక్కడ సాధారణ వర్షపాతం 442.6 మి.మీ. మాత్రమే. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ సాధారణం కంటే

# అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తా

మొదటి పేజి తరువాయి

సామాజిక న్యాయం అనగానే అందరూ భయపడుతున్నారని.. అయితే ఇది ధర్మపోరాటమని కవిత అన్నారు. రాష్ట్రంలో బీసీలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరస్పరం ప్రేమ లేఖలు రాసుకుంటారని.. బీసీ బిల్లుకు ఆమోదం తీసుకురావడంలో ఈ దోస్తీ ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు బీసీ



బిల్లుకు ఆమోదం రాకపోతే సంక్రాంతి తర్వాత ఢిల్లీకి వెళ్లి ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు. తెలంగాణలో ఇప్పటికీ కుల వివక్ష కొనసాగుతోందని కవిత అన్నారు. తాను అగ్రవర్ణ కుటుంబంలో పుట్టినా, అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన వారంతా కూడా బుద్ధుడి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, అలాగే ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కవిత డిమాండ్ చేశారు.

# పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి

మొదటి పేజి తరువాయి

ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది. ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు



# ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాకు ఆమోదం

మొదటి పేజి తరువాయి



సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం 30కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. ఆక్వా రంగానికి విద్యుత్ రాయితీ: పారిశ్రామిక విప్లవం కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాలకు ఆమోదం తెలిపారు. పరిపాలనా, చట్టపరమైన సంస్కరణలలో భాగంగా ఏపీ దిశా బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి కొత్త కఠిన చట్టాలను తీసుకురావాలని నిర్ణయించారు. పారిశ్రామిక వేగానికి బల్క్‌డ్రగ్ పార్క్ కోసం హుడ్కో నుంచి 680 కోట్ల రూపాయల రుణం, ఆక్వా రంగానికి యూనిట్‌కు రూపాయిన్నర విద్యుత్ రాయితీని కొనసాగించనున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పునర్వ్యవస్థీకరణతో పాటు మున్సిపల్ భూముల లీజు గడువును 25ఏళ్లకు పైగా పెంచేలా చట్టసవరణలకు ఆమోదం తెలిపారు. స్లమ్ పేదలకు ఇళ్లు: రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ పనులను వేయి కోట్ల రూపాయలతో ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించి రుణం సమీకరించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు అదనపు డిజైన్ల వ్యయాన్ని 206 కోట్లకు పెంచుతూ సవరించిన అనుమతులు మంజూరు చేశారు. రైతుల యాన్యుటీ చెల్లింపుల కోసం తీసుకున్న 300 కోట్ల రుణానికి, 'అమరావతి ఐ' ప్రాజెక్టు రీ-టెండర్లకు పచ్చజెండా ఊపారు. వైకుంఠపురం ఇనాం భూముల వివాదాన్ని 122 కోట్ల రూపాయల పరిహారంతో శాశ్వతంగా పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నారు. కుప్పం ఎయిర్‌పోర్ట్ బాధితులకు ఎకరాకు 12 లక్షల 44వేల రూపాయల పరిహారం, విశాఖ వెలంపేట స్లమ్ పేదలకు 28కోట్ల 44 లక్షలతో బహుళ అంతస్తుల భవనాలను మంజూరు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఘాట్ ల అభివృద్ధికి నిధులు: పాదచారుల భద్రతా పాలసీ-2026 అమల్లోకి తెస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాలు- 2027 ఘాట్‌ల అభివృద్ధికి 210 కోట్ల రూపాయలు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విద్యా వ్యవస్థ విస్తరణలో భాగంగా ఆర్ వీఎస్ , ప్రగతి ప్రైవేట్ యూనివర్సిటీలతో పాటు కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో

# విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యకు అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలి

మొదటి పేజి తరువాయి

కేంద్ర హోం మంత్రి సభకు వచ్చి చెప్పాలని మేం కోరుతున్నాం. ఈ విషయంపై ప్రకటన చేయడానికి ఆయనను ఏది అడ్డుకుంటోంది? అది కేవలం ఆయన అహంకారమా? లేదంటే భయమా? పార్లమెంట్ ఉనికిని లెక్కచేయడం లేదా? రాజ్యసభలోనూ మేం ఈ అంశాన్ని లేవనెత్తాం. అయినప్పటికీ, వారు ప్రకటన చేయడానికి అంగీకరించలేదు. మా రాజ్యసభ ఎంపీలు గురువారం ఛైర్మన్‌ను కలిసి, ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, కేంద్ర హోం మంత్రి సభలో ప్రకటన చేయాలని కోరారు. అయితే, ఈ విషయంపై హోం మంత్రి సభకు వచ్చి మాట్లాడాలని సభలోని సభ్యులందరూ కోరుకుంటున్నారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖకు ఛైర్మన్ చెప్పడం నాకు సంతోషాన్నిచ్చింది."

**- మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు**



### 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు

మరోవైపు, ఉత్తర్ ప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు అయింది. అయితే, ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమం అంటే అధికార యంత్రాంగానికి ఎందుకు అంత భయమో అర్థం కావడం లేదు' అంటూ విమర్శించారు. గురువారం దిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ప్రియాంకా గాంధీ, ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అంతకుముందు, ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్స్‌లో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడేందుకు 'ఛాత్రోం కీ గూంజ్' అనే కార్యక్రమాన్ని షెడ్యూల్ చేశారు. అయితే, ఈ వేదికను కేటాయించిన కాయస్థ పాఠశాల ట్రస్ట్, చివరి నిమిషంలో అనుమతిని ఉపసంహరించుకుంది. విద్యాపరమైన ఆందోళనలు, అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వును ఉటంకిస్తూ, కళాశాల యాజమాన్యం అనుమతిని రద్దు చేసింది. ప్రయాగ్ రాజ్ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడికి రాసిన లేఖలో, విద్యార్థుల విద్యా కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమం నిర్వహించడం వల్ల సమీపంలోని రెండు పాఠశాలల విద్యార్థులు ప్రభావితం అవుతారని తెలిపింది. వర్షం కారణంగా క్రీడా మైదానంలో దెబ్బతినే అవకాశం ఉందని, దానివల్ల మరమ్మతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని వెల్లడించింది. అందువల్ల పాఠశాల కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తేదీని నిర్ణయించుకోవాలని పాఠశాల యాజమాన్యం తన లేఖలో పేర్కొంది. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ ప్రతిపాదించిన ఛత్రోం కి గూంజ్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని, కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి భయపడే బీజేపీ ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. "వాళ్లు (బీజేపీ) పార్లమెంట్ లోపలనే కాకుండా, బయట కూడా భయపడుతున్నారు. విద్యార్థుల గొంతును వినిపించడానికి వెళ్లిన ప్రతీసారి సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. వారు ఏం చేసినా మా ప్రయత్నాన్ని మేం కొనసాగిస్తాం" అని విమర్శించారు.

### పార్లమెంట్ ఆవరణలో విపక్షాల నిరసనలు

ఇదిలా ఉండగా, జులై 20న సీజేపీ నిరసనకారులపై 'పోలీసు చర్య', రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణల వివాదంపై ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. పలువురు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీలు "చందా చోర్, గద్దీ ఛోడ్" (విరాళాల దొంగలారా, తప్పుకో) అనే నినాదాలతో పోస్టర్లను ప్రదర్శించారు. అక్కడే ఉన్న ఇతర ప్రతిపక్ష ఎంపీలు "అమిత్ షా జవాబ్ దో" (అమిత్ షా, సమాధానం ఇవ్వండి) అని రాసి ఉన్న పోస్టర్లను పట్టుకుని షాకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని ప్లకార్డులతో నిరసనకు దిగారు. కాగా, వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష పార్టీలు ఈ రెండు అంశాలపై పార్లమెంటులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతూనే ఉన్నాయి.

### గళం విప్పితే రామునికి వ్యతిరేకులని ముద్రవేస్తున్నారు!

కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ), సమాజ్‌వాదీ పార్టీలు "శ్రీరామునికి వ్యతిరేక" వైఖరిని కలిగి ఉన్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ఆరోపించారు. ఈ పార్టీలు దేవుడి ఉనికిని నిరంతరం వ్యతిరేకిస్తూ, రామ మందిర నిర్మాణాన్ని నిరసిస్తున్నాయని ఆయన విమర్శించారు. అయితే, కిరణ్ రిజిజు వ్యాఖ్యలను శివసేన ఎంపీ సంజయ్ రౌత్ విమర్శించారు. రామమందిర విరాళాలు దుర్వినియోగం జరిగిందని, ఆ సమస్యపై ప్రశ్నలు లేవనెత్తనందుకు రామునికి వ్యతిరేకులని

# పరామర్శల పేరుతో జగన్ విధ్వంసం, అరాచకం సృష్టిస్తున్నారు: హోం మంత్రి అనిత

మొదటి పేజి తరువాయి

రెండేళ్లలో జగన్ చేసిన పర్యటనలతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. పరామర్శల పేరుతో విధ్వంసం, అరాచకం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన భూటకపు పరామర్శలు చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. మంచి, చెడు రెండింటిని ప్రజలు గమనిస్తారని తెలిపారు. ఈ రెండేళ్లలో రెండు వేర్వేరు నడవడిక ఉన్న నాయకులను ప్రజలు చూశారని చెప్పుకొచ్చారు.

### చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నారు..


సీఎం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యానించారు. సీఎం కృషితోనే పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా సపోర్టు చేస్తోందని వెల్లడించారు. మరోవైపు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకం జరుగుతోందని ఆగ్రహించారు. ఆయన బయట అడుగుపెడితే మహిళలకు రక్షణ లేదని, సామాన్య ప్రజలు వ్యాపారాలు చేసుకోలేరని చెప్పుకొచ్చారు. పోలీసులను సైతం బెదిరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఏపీలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏదో ఒక పరామర్శ పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్తు మన బిడ్డలదని... మన చుట్టూ ఎలాంటి నాయకులు ఉన్నారో గమనించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు చేసే హక్కు ప్రతిపక్షానికి ఉందని చెప్పుకొచ్చారు. ఆ పార్టీ నేతలు బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడగాలని.. తాము సమాధానం చెబుతామని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనినైనా ఆయన చేస్తున్నారా ప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు.

### దిశా చట్టం లేకుండానే పోలీస్ స్టేషన్లు పెట్టారు..

దిశాబిల్లు ఉపసంహరణపై హోం మంత్రి అనిత మాట్లాడారు. జగన్ హయాంలో దిశా చట్టం లేకుండానే పోలీస్ స్టేషన్లు పెట్టారని, పోలీసులకు బాధ్యతలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. పోలీసులకు ఫింగర్ ప్రింట్ అథంటికేషన్ ఎక్విప్‌మెంట్ కూడా వైసీపీ హయాంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ఎంతమంది వస్తారు, బారికేడ్లు ఎంత ఎత్తులో ఉండాలో పోలీసులే చెబుతారని అన్నారు. చట్టాలను గౌరవించేవారికి అవి వర్తిస్తాయని చెప్పారు. వారు నిబంధనలను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధ్వంసం సృష్టించాలనే ఆయన బయటకు వస్తున్నారని మండిపడ్డారు. 2019కు ముందు ఒక్క ఛాన్స్ అని చెప్పి అరాచకం సృష్టించారని ఆగ్రహించారు. శుక్రవారం వస్తే చాలు ఎవరిని జైల్లో పెడతారో తెలియని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందని ఆరోపించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి చెప్పుకోవడానికి ఎన్ని పేజీలైనా సరిపోవని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని జగన్ చూడలేకపోతున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎక్కడికి వచ్చినా విధ్వంసాలు, ఉద్రేకాలు సృష్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించే తాము చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజలు ఈ రెండేళ్లలో ప్రశాంతంగా ఉన్నారా..? లేదా..? అని ప్రశ్నించారు. జగన్ వెనుక ఉన్నది జన్‌జీలు కాదని.. గంజాలు అని ఎద్దేవా చేశారు.

### జగన్‌కు అర్హత మేరకే సెక్యూరిటీ కల్పించాం..

జగన్‌కు అర్హత మేరకే సెక్యూరిటీ కల్పించామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. డీఎస్సీ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కోర్టులు చెప్పాయని ప్రస్తావించారు. అయినా ఏమీలేని దానికి డీఎస్సీని భూతద్దంలో జగన్ అండ్ కో చూపుతున్నాయని ధ్వజమెత్తారు. వైసీపీ నేతలకు మంత్రి నారా లోకేశ్ అంటే భయమని



విమర్శించారు. ఆ పార్టీ చేపట్టిన డీఎస్సీ ధర్నాలో ఎంతమంది అభ్యర్థులు ఉన్నారని నిలదీశారు. గొడ్డలి పార్టీ విన్యాసాలను చూసి రాష్ట్రం సిగ్గుపడుతోందని విమర్శించారు. భస్మాసురుడికి అహం తలకెక్కినట్లే జగన్ ప్రవర్తన ఉందని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చిన ప్రజల నాశనాన్ని కోరుకున్నారని ఆగ్రహించారు.

భస్మాసురుడికి పట్టిన గతే గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి పడుతుంది..

భస్మాసురుడికి పట్టిన గతే గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి పడుతుందని హోం మంత్రి అనిత సెటైర్లు గుప్పించారు. విజనరీ నాయకుడు చంద్రబాబు ఏపీని అభివృద్ధి చేస్తున్నారని ఉద్ఘాటించారు. ఆయన విధ్వంసం, అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ పర్యటనల్లో సామాన్యుల జీవితాలను ఇబ్బంది పెట్టారని, వారి ఆస్తులను విధ్వంసం చేశారని మండిపడ్డారు. మిర్చి రైతుల పరామర్శ పేరుతో గుంటూరు మిర్చియార్డుకు వెళ్లి రైతులను తన బౌన్సర్లతో కొట్టించారని ఆగ్రహించారు. మిర్చి టిక్కీలను ఫ్యాన్ పార్టీ నేతలు దొంగతనం చేశారని ఆరోపించారు. పరామర్శ పేరుతో బల ప్రదర్శనలు చేసి.. రైతులను కొట్టి.. దొంగతనాలు చేస్తారా..? ఇదేం తీరు.? అని ప్రశ్నించారు. గంజాయి తాగండి... మహిళలను ఏడ్పించాలని జగన్ మోహన్ రెడ్డి జనాలకు చెప్పాలనుకుంటున్నారా..? అని ఎద్దేవా చేశారు. జగన్ సొంత బాబాయ్ హత్యలో ఆయన వ్యవహరించిన తీరు చూశారని తెలిపారు. తల్లిదండ్రులు యువతను గొడ్డలి పార్టీ కార్యక్రమాలకు పంపొద్దని హోం మంత్రి అనిత

# కడుపు నింపే చేతులు“ఎండలో కాలి, వానలో తడిసి... అన్నం పెట్టే అన్నదాత కష్టం




: ప్రత్యేక ప్రతినిధి ఉదయం 10 గంటలు. ఎండ నిప్పులా కాస్తోంది. పొలం మొత్తం పచ్చగా కనిపిస్తోంది. కానీ ఆ పచ్చదనం వెనుక ఎంతో కష్టం ఉంది. నెత్తికి గుడ్డ కట్టుకుని, వీపుకు పురుగుల మందు ట్యాంక్ మోస్తూ పొలంలో నడుస్తున్న రైతులు. కాళ్ల కింద మట్టి మండుతోంది. నుదుటి నుంచి చెమట కారుతోంది. అయినా వాళ్లు ఆగడం లేదు. ఎందుకంటే ఆగితే పైరు నిలబడదు. పైరు నిలబడకపోతే ఇల్లు నిలబడదు. ఇది ఏదో ఒక రోజు కథ కాదు. ఇది ప్రతి రైతు రోజువారీ జీవితం. ఒక ఎకరం వెనుక 365 రోజుల యుద్ధం రైతు అంటే కేవలం విత్తనం వేసేవాడు కాదు. అతను ప్రకృతితో, బ్యాంకులతో, మార్కెట్ తో, ప్రభుత్వాలతో ప్రతిరోజూ పోరాడే యోధుడు. విత్తనం కొనడానికి అప్పు. ఎరువుల కోసం అప్పు. పురుగుల మందు కోసం అప్పు. పంట వచ్చే వరకు 6 నెలలు కళ్లలో ఒత్తిడి. వాన పడకపోతే కరువు. వాన ఎక్కువ పడితే వరద. పంట చేతికి వచ్చే సరికి ధర లేదు. అప్పు తీర్చడానికి మళ్లీ అప్పు. ఆకుపచ్చ మొక్కలు చూస్తుంటే అందంగా ఉన్నాయి. కానీ ఆ మొక్క ప్రతి ఆకులో రైతు కన్నీరు, ఆశ కలిసి ఉన్నాయి. వీపు మీద ఉన్న ట్యాంక్ లో విషం కాదు... అది అతని కుటుంబ భవిష్యత్తు. మనం తినే ప్రతి మెతుకులో...మనం ఉదయం 9 గంటలకు లేచి హోటల్ లో ఇడ్లీ తింటాం. రూ 50 బిల్లు ఇస్తాం. కానీ ఆ ఇడ్లీకి కావాల్సిన బియ్యం పండించిన రైతుకు కిలోకు 25 రూపాయలు కూడా మిగలవా? మనం 3000 రూపాయల చొక్కా వేసుకుంటాం. కానీ ఆ చొక్కాకు కావాల్సిన పత్తి పండించిన రైతు అప్పుల పాలవుతున్నాడు. మనకు ఆకలి వేస్తే రెస్టారెంట్ కు వెళ్తాం. రైతుకు ఆకలి వేస్తే పొలం గట్టు మీద కూర్చుని చల్లారిపోయిన అన్నం తింటాడు. “అన్నదాత సుఖీభవ“ - నినాదమా? నిజమా? ప్రతి నాయకుడు స్టేజ్ మీద “రైతు రాజు“ అని చెప్తాడు. ప్రతి ప్రకటనలో “అన్నదాతకు జై“ అంటాం. కానీ రైతు ఆత్మహత్య చేసుకున్నప్పుడు మాత్రం 2 నిమిషాల న్యూస్. అంతే. రైతులు ఏ పథకం కోసం ఎదురు చూడడం లేదు. వాళ్లకు కావాల్సింది గౌరవం. వాళ్లు పండించిన పంటకు గిట్టుబాటు ధర. కష్టానికి తగ్గ ఫలితం. ఆశిస్తారు అంతే. ఈరోజు రాత్రి మీరు అన్నం తినే ముందు ఒక్కసారి ఆలోచించండి. ఆ అన్నం ప్లేట్ లోకి రావడానికి ఒక రైతు ఎన్ని ఎండలు, ఎన్ని వానలు, ఎన్ని కన్నీళ్లు దాటి వచ్చాడో. రైతు లేకపోతే దేశం లేదు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.

# జైనూర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో ప్రొపెసర్ ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

## తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సేవలు మారువలేనివి



కొమురం భీం : అసిఫాబాద్ జిల్లా :జైనూర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు నాయబ్ తహసీల్దార్ ఆడ బీర్షావ్ ఆచార్య జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ జీవితాంతం కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమోహన్ సందీప్ భారత్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# సమస్యల పరిష్కారమే లక్ష్యం.. డీఎఫ్వోను ఆశ్రయించిన మంగి సర్పంచ్, గ్రామ నాయకులు

## ఉమ్మడి గ్రామపంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి




ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని ఉమ్మడి మంగి గ్రామపంచాయతీలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం మంగి గ్రామ సర్పంచ్ రాయిసిడం వినోద్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు జిల్లా అటవీ అధికారి (ఐఖీూ) బాలమణిని ఆసిఫాబాద్లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మంగి గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఎఫ్వో దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అటవీ శాఖ పరిధిలో పెండింగ్లో ఉన్న అంశాలు, గ్రామాభివృద్ధికి ఆటంకంగా మారిన సమస్యలు, ప్రజల రాకపోకలు, మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామ ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వినతిని స్వీకరించిన డీఎఫ్వో బాలమణి సమస్యలను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం అధికారులు సానుకూలంగా స్పందించి, ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ రాయిసిడం వినోద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, అచ్యుత్ రావు, పటేల్ గణేష్, రాంషా, చీను, ఎస్.కే. ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు ఐక్యంగా కృషి చేయడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# సీతగొంది ఎంపీపీ పాఠశాలలో మొక్కల నాటకం, విద్యార్థులకు టీ-షర్టు, నెక్కర్లు, బోరోప్లస్ సబ్బుల పంపిణ







కుమురం భీం: (ఆసిఫాబాద్) జిల్లా సిర్పూర్ (యు) మండలం సీతగొంది గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కల నాటకం మరియు విద్యార్థులకు అవసరమైన వస్తువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఆడ వెంకటేష్ గారి ఆదేశాల మేరకు, సిర్పూర్ (యు) మండల కోఆర్డినేటర్ ఆత్రం మాధవరావు గారి ఆధ్వర్యంలో సీతగొంది ఎంపీపీ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులకు టీ-షర్టు, నెక్కర్లు మరియు బోరోప్లస్ సబ్బులు పంపిణీ చేశారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్యార్థుల సంక్షేమం, పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు యంగ్ ఇండియా ఫౌండేషన్, హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు పూనం అగర్వాల్, పూజా లాల్వాని, అర్జున్ కేడియా, ప్రదీప్ గుప్తా మరియు జయంతి మేడం సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు సీఆర్పీ ఆత్రం హన్మంత్ రావు, కే. బాపు, తిరుమన్ రావు, ఆత్రం జాలీషావ్ (సర్పంచ్), పాఠశాల ఉపాధ్యాయులు తిరుమన్ రావు, రమేష్, జంగు, హన్మంత్ రావు (కారోబరి) తదితరులు పాల్గొన్నారు.

# “నేను ఈ నేలపై పుట్టి పెరిగిన ఆదివాసి బిడ్డనే... నన్ను నాన్-లోకల్ అనడం రాజకీయ దివాళాకోరుతనం“ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

పార్టీలో కుట్ర రాజకీయాలు చేస్తున్న వారికి కార్యకర్తలే బుద్ధి చెబుతారు అధిష్ఠానం నిర్ణయాలను ప్రశ్నించడం సరికాదని హెచ్చరిక

నేను ఈ నేలపై పుట్టి పెరిగిన ఆదివాసి బిడ్డను... నన్ను నాన్-లోకల్ అనడం రాజకీయ దివాళాకోరుతనం..పార్టీలో కుట్ర రాజకీయాలు చేసే వారికి కార్యకర్తలే బుద్ధి చెబుతారు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క....

కొమురం భీం : ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కొంతమంది నాయకులు వ్యక్తిగత స్వార్థం, పదవుల రాజకీయాల కోసం కావాలనే వర్గ విభేదాలను రెచ్చగొడుతూ పార్టీని బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలతో డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుగుణక్క మాట్లాడారు.... మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి కొంతమంది కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేసి, అభివృద్ధి పనులు ఇప్పిస్తామంటూ హైదరాబాద్ గాంధీభవన్కు తీసుకెళ్లి తనపై ఆరోపణలు చేయించారని ఆమె ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమం కాదని, కొందరు నాయకులు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకమని విమర్శించారు.

### నన్ను నాన్-లోకల్ అంటున్న వారు ముందుగా



ఈ నేల చరిత్ర తెలుసుకోవాలి.



నేను కొమురంభీమ్ గడ్డపై పుట్టి పెరిగిన ఆదివాసి బిడ్డను.సిర్పూర్-యూ మండలం పుల్లార గ్రామంలో జన్మించి,ఈ జిల్లా మట్టి వాసనతో పెరిగిన వ్యక్తిని. ఈ నేలపై నాకు ఉన్న హక్కును ప్రశ్నించే నైతిక హక్కు ఎవరికీ లేదు. ఆదివాసి బిడ్డను నాన్-లోకల్గా చిత్రీకరించడం జిల్లా ప్రజలను, ఆదివాసీ సమాజాన్ని అవమానించడమే అని సుగుణక్క అన్నారు.తాను 1995 ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీటీసీ గా గెలిచాను. అప్పటి నుంచి పార్టీ మారలేదు. ఉపాధ్యాయ వృత్తి చేసుకుంటున్న సమయంలో పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చింది. అనంతరం తన పనితీరు, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానమే తనకు టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా,డీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. ఆ నిర్ణయాన్ని కొంతమంది సొంత లాభం కోసం వీధుల్లో నిలబడి ప్రశ్నించడం అంటే పార్టీ అధిష్ఠానాన్నే సవాల్ చేయడమేనని అన్నారు. పదవులు రాకపోవడంతో అసంతృప్తిని పార్టీపైకి మళ్లిస్తూ, కార్యకర్తలను రెచ్చగొట్టి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రజల మధ్య పార్టీని బలోపేతం చేయాల్సిన నాయకులే పార్టీని బలహీనపరిచే కార్యక్రమాలు చేపట్టడం అత్యంత దురదృష్టకరమన్నారు. తాను ఎవరిపైనా కక్షతో రాజకీయాలు చేయనని, కానీ పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యలను మాత్రం సహించబోనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ వ్యక్తుల పార్టీ కాదని, కార్యకర్తల పార్టీ అని, అందరికీ సమాన గౌరవం లభించేలా పనిచేస్తున్నానని తెలిపారు పార్టీని బలోపేతం చేయకుండా, వ్యక్తిగత రాజకీయాల కోసం గాంధీభవన్ను వేదికగా మార్చిన వారు కార్యకర్తలకు సమాధానం చెప్పాల్సిన రోజు తప్పకుండా వస్తుందని అన్నారు. పార్టీని ధిక్కరించి, అధిష్ఠానం నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకిస్తున్న వారిపై కాంగ్రెస్ అధిష్ఠానం తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.ఇప్పటికైనా కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పార్టీ జెండా కింద ఐక్యంగా నిలబడి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సుగుణక్క పిలుపునిచ్చారు.

# ఆదివాసీలకు అండగా జిల్లా పోలీసులు..!

జైనూర్లో వారానికో 'పోలీస్ ప్రజావాణి' ఆదివాసి యువతకు ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు దేశానికి గర్వకారణం : జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్

ఆసిఫాబాద్, : ప్రజలకు మరింత చేరువ కావడం, ఆదివాసి సమాజంతో విశ్వాసపూర్వక బంధాన్ని బలోపేతం చేయడం, గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ మరో కీలక అడుగు వేసింది. “పోలీసులు మీకోసం“ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయం, ఆసిఫాబాద్లో ఆదివాసి పటేళ్లు, సంప్రదాయ నాయకులు, గొండ్వాన రాయి సెంటర్ సార్మడీలు, సభ్యులతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి యువతకు ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ, జైనూర్లో ప్రతి వారం ప్రత్యేక పోలీస్ ప్రజావాణి నిర్వహణ, గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రజల సహకారం వంటి పలు కీలక అంశాలపై ఎస్పీ స్పష్టమైన ప్రకటనలు చేశారు. సమావేశంలో మాట్లాడిన జిల్లా ఎస్పీ నితికా పంత్... కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అనేది సాధారణ జిల్లా కాదని, వీరుల త్యాగాలతో చరిత్ర సృష్టించిన నేల అని అన్నారు. జల్-జంగల్-జమీన్ కోసం పోరాడిన అమరవీరుడు కుమురం భీమ్, గిరిజన ఉద్యమ యోధుడు రాంజీ గోండ్ వంటి మహనీయుల పోరాటాలు దేశానికి స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. అలాంటి చారిత్రక జిల్లాలో పోలీస్ సూపరింటెండెంట్గా సేవలందించడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు భారతదేశ వైవిధ్యానికి ప్రతీక అని పేర్కొన్న ఎస్పీ... గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ఆదివాసి పటేళ్లు, నాయకులు, సార్మడీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పోలీసు శాఖకు ప్రజలు సహకరిస్తే నేరాల



నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ప్రతి గ్రామంలో పెద్దలు, నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా షీ టీమ్ కళాబృందం, పోలీసు అధికారులు, సిబ్బంది ద్వారా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, మహిళల రక్షణ, ఆదివాసీల సంక్షేమమే జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జైనూర్ ప్రాంత ప్రజలకు జిల్లా ఎస్పీ మరో కీలక హామీ ఇచ్చారు. ప్రతి వారం ఒక రోజు ప్రత్యేక 'పోలీస్ ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి వేగంగా పరిష్కరించే చర్యలు చేపడతామని వెల్లడించారు. పోలీస్ స్టేషన్ వరకు రావాల్సిన అవసరం లేకుండా ప్రజలకు అందుబాటులోనే సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన



ఉద్దేశమని వివరించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న పోలీస్ నియామకాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని నిరుద్యోగ ఆదివాసి యువతకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పూర్తిగా ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. శారీరక దారుఢ్యం, రన్నింగ్, రాత పరీక్షలకు సంబంధించిన శిక్షణతో పాటు నిపుణుల మార్గదర్శకత్వంలో కోచింగ్ అందించి ఎక్కువ మంది ఆదివాసి యువత పోలీస్ ఉద్యోగాలు సాధించేలా అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఆదివాసి నాయకులు తమ గ్రామాలకు సంబంధించిన రహదారులు, తాగునీరు, భద్రత, సైబర్ మోసాలు, యువత సమస్యలు తదితర అంశాలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. సమావేశం ముగింపులో గొండ్వాన రాయి సెంటర్ సార్మడీలు, ఆదివాసి నాయకులు జిల్లా ఎస్పీ నితికా పంత్ను ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పోలీసు అధికారులు, ఆదివాసి నాయకులు, ప్రజలు కలిసి సహపంక్తి భోజనాల్లో పాల్గొని పరస్పర ఆత్మీయతను చాటుకున్నారు.

# ఆచార్య జయశంకర్ 92వ జయంతిని ఘనంగా నిర్వహించిన బీసీ సమాజ్

మంచిర్యాల, : తెలంగాణ జాతిపిత, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్త అయిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారి 92వ జయంతి సందర్భంగా బీసీ సమాజ్ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల ఐబి మున్సిపల్ ఆఫీస్ రోడ్డు చౌరస్తాలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ తన జీవితాన్నంతా అంకితం చేశారని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటానికి ఆయన మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆయన ఆశయాలను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ముఖ్యంగా బీసీలు, బలహీన వర్గాలు, యువత, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని చెప్పారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్యా అభివృద్ధి కోసం జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల



ప్రయోజనాలకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాలు, వివక్షలు, దాడులను సంఘటితంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వివిధ బీసీ కులాలు ఐక్యంగా ముందుకు వచ్చినప్పుడే సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికార సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, అలాగే బీసీల సంక్షేమం, భద్రత, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన, రాజకీయ ప్రాతినిధ్యం పెంపు కోసం బీసీ సమాజ్ ఆధ్వర్యంలో మరింత సంఘటితంగా ఉద్యమాలు నిర్వహిస్తామని, ఆచార్య జయశంకర్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్, బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా నాయకుడు ఎదునూరి రమేష్, వీర్ల మదన్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్, కార్పెంటర్ సంఘం మంచిర్యాల అధ్యక్షుడు పెద్దోచ్ హనుమంతు, గంగపుత్ర సంఘం జిల్లా నాయకుడు మంచర్ల సదానందం, కురుమ సంఘం జిల్లా నాయకుడు పొట్టాల మల్లేష్, గాండ్ల తిలకేశ్వర్, జిల్లా నాయకుడు జక్కం రవీందర్, బీసీ సమాజ్ నాయకులు బద్రి శ్రీనివాస్, వెన్నంపల్లి మురళి, గుండ్ల లక్ష్మణ్, తాటిపాముల సమ్మయ్య, దురిశెట్టి రాజేందర్ ప్రసాద్, సత్యనారాయణ చారి, రాజా చారి, బండారి సత్యం, పరిపెల్లి రాజేష్, మూడేపల్లి రమేష్, నగునూరి సారయ్య తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్కు ఘన నివాళులు అర్పించారు.

# ఆచార్య జయశంకర్ సార్ 92వ జయంతి సభ ఘనంగా నిర్వహణ

## సామాజిక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణవాదులకు పిలుపు



మంచిర్యాల,: తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జయశంకర్ సార్ చిత్రపటానికి ఉద్యమ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, 1200 మంది విద్యార్థుల ఆత్మబలిదానాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం భౌగోళిక తెలంగాణగానే నిలిచిందని, అమరవీరులు ఆశించిన సామాజిక తెలంగాణ ఇంకా సాకారం కాలేదని పేర్కొన్నారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలంటే సామాజిక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మరో ఉద్యమం అవసరమని ఆయన పిలుపునిచ్చారు. జయశంకర్ సార్ కలలు కన్న సామాజిక తెలంగాణ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు, ఉద్యమకారులు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. తెలంగాణ ఏర్పాటుతో నీళ్లు, నిధులు, నియామకాలు ప్రజలకు అందుతాయని ఆశించినా, ఆ లక్ష్యాలు పూర్తిగా నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలకు పైగా గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని, 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తూ జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభలో పాల్గొన్న ఉద్యమకారులు “ప్రొఫెసర్ జయశంకర్ సార్ అమర్ హై“, “తెలంగాణ ఉద్యమకారుల ఐక్యత వర్ధిల్లాలి“, “తెలంగాణ అమరవీరులకు జోహార్లు“, “సామాజిక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడుదాం“ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎ. గంగయ్య, నాయకులు ఎం. అంజయ్య, పేరాల రాజమల్లు, మియాపురం వీరాచారి, బోనగిరి కృష్ణ, చిందం మల్లేష్, గోల్కొండ లక్ష్మీనారాయణ, పోతురాజుల చంద్రయ్య, బి. దశరథం, పి. వెంకటరత్నం, ఐ. రామయ్య, గోపతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రత తొలగింపుపై కాగజ్నగర్లో నిరసన ధర్నా




ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్నగర్ మండలం మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్కు రాష్ట్ర ప్రభుత్వం బుల్లెట్ ప్రూఫ్ వాహనం, గన్మెన్ భద్రతను తొలగించడాన్ని నిరసిస్తూ కాగజ్నగర్ పట్టణంలో మహా ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్తంగా 5 వేల మందికి పైగా ఐపీఎస్ అధికారులు వ్యక్తిగత స్వార్థాన్ని పక్కనపెట్టి ప్రజల భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారని, ప్రవీణ్ కుమార్ భద్రతను తొలగించడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన హీనమైన చర్య అని నిరసనలో నాయకులు తెలిపారు. ఆయుధాలు లేకుండా అడవుల్లోకి వెళ్లి నక్సలైట్లతో చర్చలు జరిపి పలువురిని జనజీవన స్రవంతిలో కలిపిన మేధావిగా ప్రవీణ్ కుమార్ను అభివర్ణించారు. బడుగు, బలహీన వర్గాల బతుకుల్లో మార్పు రాజ్యాంగం ద్వారానే సాధ్యమని బలంగా నమ్మిన వ్యక్తిగా పేర్కొన్నారు. ప్రవీణ్ కుమార్కు వ్యక్తుల నుండి కాకుండా, ఎదిరించిన భావజాలం నుండే ప్రాణహాని ఉందని, ఇలాంటి ముప్పు ఉన్నప్పటికీ రాజకీయ కక్ష సాధింపు కోసమే భద్రతను తొలగించడం బాధాకరమని తెలిపారు. ప్రెసిడెంట్ మెడల్ సాధించిన మాజీ అడిషనల్ డీజీపీ స్థాయి అధికారికే రక్షణ కరువైతే క్షేత్రస్థాయిలో పనిచేసే కానిస్టేబుళ్లు, ఎస్ఐలకు ప్రభుత్వం ఏ విధంగా భరోసా ఇస్తుందని ప్రశ్నించారు. ప్రవీణ్ కుమార్కు భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని, వెంటనే భద్రతను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే భద్రత కల్పించని పక్షంలో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని సోషల్ మీడియా వింగ్ నాయకులు దొబ్బల మంగేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## చనుబాలతో తల్లీబిడ్డలిద్దరికీ మేలట

# ఏ సమయంలో పాలు ఇవ్వాలో తెలుసా?

**తల్లిపాలతో పిల్లలకు ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందంటున్న నిపుణులు!**



బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానం. సకల పోషకాలు మిళితమైన ఈ పాలు పసిపిల్లలకు శ్రేష్ఠమైనవి. అవి తాగడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా పెరగడమే కాదు, ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యమూ బాగుంటుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. అందుకే వాటి విశిష్టతను గురించి అవగాహన కలిగించేందుకు ప్రభుత్వాలు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు ఏటా ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాల్ని నిర్వహిస్తున్నాయి. అసలు తల్లిపాల వల్ల పిల్లలకు, తల్లికి ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

**శిశువు తొలి రక్షాకవచం :**

ప్రసవించగానే వచ్చే లేత పసుపు రంగు ద్రవం... దీన్నే కొలొస్ట్రమ్ లేదా ముర్రుపాలు అంటారు. ఇందులో యాంటీబాడీలు సమృద్ధిగా ఉండటంతో పసిపిల్లలకు ఇచ్చే తొలి టీకాగానూ పేర్కొంటారు. కార్బోహైడ్రేట్లు తక్కువగా, కొవ్వులు, ప్రొటీన్ ఎక్కువగా ఉండే కొలొస్ట్రమ్ నవజాత శిశువును ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుందంటున్నారు నిపుణులు. పొట్టలో మైక్రోబయోమ్?ను ఏర్పరచడంలో సాయపడుతుందని చెబుతున్నారు. అందుకే ఇది శిశువుకి సూపర్?ఫుడ్? కూడా పేర్కొంటున్నారు.

**దీర్ఘకాలిక ఆరోగ్యానికి మేలట :**

తల్లిపాలు తాగే పిల్లల్లో నాడీ సంబంధిత అభివృద్ధి బాగుంటుందని పేర్కొంది. దీర్ఘకాలంలో శారీరక, దంత ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపింది. ఆస్తమా, మధుమేహం, చెవి ఇన్ఫెక్షన్లు, డయేరియ న్యుమోనియా, ల్యుకేమియా వంటివి వచ్చే ప్రమాదం తగ్గుతుందని పేర్కొంది. తల్లిపాలు తాగే పిల్లలు మేధో పరీక్షలలో మెరుగ్గా రాణిస్తారు, అధిక బరువు లేదా ఊబకాయం బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుందని ఔనూ పేర్కొంది.

**సమయాన్ని బట్టి మారే తల్లిపాల గుణం :**

అమ్మపాలు గంటన్నరలోనే జీర్ణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, కొంతమంది పిల్లలు తరచూ ఆకలితో లేస్తుంటారని చెబుతున్నారు. ఉదయం పూట వచ్చే పాలు పలుచగా దాహం తీరేలా ఉంటాయని తెలియజేస్తున్నారు. రాత్రివేళల్లో ఇచ్చే పాలల్లో కొవ్వు పరిమాణం ఎక్కువగా ఉంటుందని వివరిస్తున్నారు.

**పాల ఉత్పత్తికి అసలైన రహస్యం :**

పాల ఉత్పత్తికి కారణమైన ప్రొలాక్టిక్ హార్మోన్ అర్ధరాత్రి నుంచి ఉదయం వరకూ ఎక్కువగా స్రవిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, ఆ సమయంలో బిడ్డకు పాలు పట్టించడం లేదా పంపింగ్ చేయడం వల్ల మరుసటి రోజు ఎక్కువ పాలు ఉత్పత్తి చేయమని శరీరానికి సంకేతం వెళుతుందని తెలియజేస్తున్నారు. అలాకాకుండా, రాత్రివేళ ఇవ్వడం మానేస్తే భవిష్యత్తులో ఉత్పత్తిని తగ్గించమని సంకేతం వెళ్లే ప్రమాదం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. చనుబాలిచ్చే సమయంలో రాత్రిపూట ప్రోలాక్టిన్?లో పెరుగుదల పనిచేస్తుందని పేర్కొంది. ఒక రొమ్ములో పాలు త్వరగా స్రవించవచ్చంటున్నారు నిపుణులు. అందువల్ల బిడ్డ ఆ రొమ్ము పాలు తాగడానికి ఇష్టపడవచ్చని చెబుతున్నారు. తినే ఆహారాన్ని బట్టి పాల రుచి మారుతుందంటున్నారు నిపుణులు. బిడ్డ పెరుగుదల, అభివృద్ధికి అనుగుణంగా వాటిల్లోని పోషకాలు నిరంతరం మారుతుంటాయని చెబుతున్నారు. అందుకే వీటి పునః సృష్టి ఎప్పటికీ సాధ్యం కాదట.

**తల్లికీ లాభమే :**

ఏడాది దాటినా పాలు ఇవ్వడం వల్ల కొన్ని రకాల వ్యాధులు ముఖ్యంగా రొమ్ము, అండాశయ క్యాన్సర్లు.. టైప్ 2 డయాబెటిస్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, ప్రసవానంతర డిప్రెషన్ వంటివి వచ్చే ప్రమాదం తగ్గుతుందంటున్నారు నిపుణులు. ప్రసవం తరవాత గర్భాశయం సాధారణ పరిమాణానికి రావడానికి సాయపడుతుందని చెబుతున్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, ఆస్టియోపోరోసిస్, హృదయ సంబంధ వ్యాధులు, ఊబకాయం వంటి ప్రమాదాలు తగ్గుతాయని అష్ట్రం.బని పేర్కొంది. మొదటి 3 మాసాల నుంచి 12 నెలల వరకూ పాలను ఉత్పత్తి చేయడానికి శరీరం రోజుకు 300-500 క్యాలరీలను ఖర్చు చేస్తుందంటున్నారు నిపుణులు. దాంతో గర్భధారణ సమయంలో పెరిగిన బరువునీ తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. బిడ్డనే గమనిస్తూ కబుర్లు చెబుతూ లాలిస్తూ పాలిచ్చే తల్లుల శిశువుని ఎక్కువగా అర్థం చేసుకోగలరని నిపుణులు చెబుతున్నారు. ఇది భవిష్యత్తులో వాళ్ల ప్రవర్తనను తీర్చిదిద్దేందుకూ తోడ్పడుతుందని పేర్కొంటున్నారు. అలాగే, తల్లీబిడ్డల మధ్య భావోద్వేగ బంధం బలపడుతుందని వివరిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## నిద్రలో చెమటలు పడుతున్నాయా?

# నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమేనట!

**రాత్రిపూట చెమటలు పలు ఆరోగ్య సమస్యలకు సంకేతాలు! పలు జాగ్రత్తలు సూచిస్తున్న ఎక్స్?పర్ట్స్?!**



పని, వ్యాయామాలు ఎక్కువ చేసినా, వేడి ప్రదేశాల్లో ఉన్నా చాలా మందికి చెమట పడుతుంటుంది. అయితే, కొంతమందికి వెదర్ చల్లగా ఉండి ఫ్యాన్?, ఏసీ ఆన్?లో ఉన్నప్పటికీ రాత్రుళ్లు నిద్రలో విపరీతంగా చెమటలు పడుతుంటాయి. ఇది చిన్న సమస్యే కదా అని కొంతమంది ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ, ఒక్కోసారి ఇది వివిధ ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య తీవ్ర రూపం దాల్చకముందే మేల్కొని డాక్టర్లును సంప్రదించడం మంచిదంటున్నారు. ఈ క్రమంలో ఎలాంటి ఆరోగ్య సమస్యల కారణంగా నిద్రలో చెమటలు పడతాయో ఇప్పుడు తెలుసుకుందాం!

**హైపర్ థైరాయిడిజం :**

థైరాయిడ్ గ్రంథి జీవక్రియలతోపాటు ఇతర శారీరక విధులు నిర్వర్తించడంలో సమర్థంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఇది అత్యంత చురుగ్గా మారినప్పుడు హైపర్ థైరాయిడిజం బారిన పడతామని అంటున్నారు. ఫలితంగా, శరీరం వేడికి తట్టుకోలేక చెమటలు పడుతుంటాయని తెలియజేస్తున్నారు. హైపర్? థైరాయిడిజం కారణంగా నిద్రలో చెమటలు పడతాయని పేర్కొంది.

**ఒత్తిడి, ఆందోళన :**

ఉన్నట్లుండి ఒక్కోసారి ఒత్తిడి, ఆందోళనలకు గురవుతామంటున్నారు నిపుణులు. వాటి ప్రభావం మెదడు, శరీరంపై పడుతుందని చెబుతున్నారు. కొన్ని రకాల మానసిక రుగ్మతలున్నప్పుడు కూడా నిద్రలో చెమటలు పట్టే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఒత్తిడితో కూడిన సంఘటన గుండె వేగంగా కొట్టుకునేలా, శ్వాస వేగవంతం అయ్యేలా చేస్తుందని పేర్కొంది. కండరాలు బిగుసుకుపోతాయని, చెమట బిందువులు కనిపిస్తాయని తెలిపింది.

**మెనోపాజ్ :**

40 దాటిన మహిళల్లో రాత్రుళ్లు నిద్రలో చెమటలు పడుతున్నాయంటే, వారు మెనోపాజ్?కు చేరువవుతున్నారనడానికి సూచనగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాగే, మెనోపాజ్ దశలో ముఖం, మెడ, ఛాతీలో అకస్మాత్తుగా వెచ్చగా అనిపించడం వల్ల చెమట పట్టవచ్చని పేర్కొంది.

కొన్ని రకాల మందులు :

కొన్ని యాంటీ డిప్రెసెంట్స్, డయాబెటిస్ మందులు, స్టెరాయిడ్స్, ఎసిటమైనోఫెన్, ఆస్పిరిన్, అధిక రక్తపోటు మందులు వాడడం వల్ల కూడా నిద్రలో చెమటలు పడతాయని పేర్కొంది. కెఫీన్? ఎక్కువగా ఉండే పదార్థాలు మితిమీరి తీసుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు చెమటలు పట్టే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరిస్తున్నారు. నిరంతరంగా, తీవ్రంగా లేదా కారణం తెలియని రాత్రిపూట చెమటలు పడుతుంటే.. ముఖ్యంగా జ్వరం, బరువు తగ్గడం, లేదా శోషరస గ్రంథులు వాపు వంటి లక్షణాలతో పాటుగా ఉంటే డాక్టరుచే పరీక్ష చేయించుకోవాలని పేర్కొంది.

**ఈ జాగ్రత్తలు :**

రాత్రిపూట నిద్రలో చెమటలు పట్టడమనేది తరచూ తలెత్తినా,

# మీ ముఖం, కళ్లలో ఈ సంకేతాలు కనిపిస్తే - బి12 లోపం కావచ్చు!

**ముందుగానే గుర్తించి అలర్ట్ కావాలంటున్న నిపుణులు - ఇలా సెట్? చేసుకోవాలని సూచన**



విటమిన్ బి12 అనేది శరీరానికి ఎంతో అవసరమైన పోషకం. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తి, నరాల పనితీరు, ఐఎన్ఎ సంశ్లేషణలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, శరీరానికి సరిపడా విటమిన్ బి12 లభించకపోయినా లేదా శరీరం దానిని సరిగ్గా గ్రహించలేకపోయినా.. ఆ లోపం చర్మం, నోరు, కళ్లతో సహా పలు అవయవాలపై ప్రభావం చూపుతుందంటున్నారు. ఈ లోపానికి సంబంధించిన అనేక ప్రారంభ లక్షణాలు, వ్యాధి నిర్ధారణ కావడానికి చాలా కాలం ముందే అద్దంలో స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొంటున్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం ద్వారా సకాలంలో వైద్య సహాయం పొందవచ్చని సూచిస్తున్నారు. నరాల దెబ్బతినడం వంటి దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని సలహా ఇస్తున్నారు.

**పాలిపోయిన చర్మం :**

బి12 లోపం ప్రారంభ సంకేతాలలో చర్మం సాధారణం కంటే ఎక్కువగా పాలిపోవడం ఒకటని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో విటమిన్ బి12 స్థాయిలు తగ్గడం వల్ల 'మెగాలోబ్లాస్టిక్ అనీమియా' వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటప్పుడు శరీరం ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలను తక్కువగా ఉత్పత్తి చేస్తుందని పేర్కొంటున్నారు. దీనివల్ల శరీర కణజాలాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుందని తెలియజేస్తున్నారు. ఫలితంగా, చర్మం పాలిపోయినట్లు కనిపిస్తుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో విటమిన్ బి12 లోపం వల్ల కలిగే రక్తహీనతను గుర్తించడానికి డాక్టర్లు కింది కనురెప్పల లోపలి భాగాన్ని కూడా పరీక్షించవచ్చని చెబుతున్నారు. మెగాలోబ్లాస్టిక్ అనీమియా అనేది ఒక రకమైన విటమిన్ లోప అనీమియా, ఇది మీకు తగినంత విటమిన్ బి12 లభించనప్పుడు సంభవిస్తుందని ఎర్కొంది. దీనివల్ల చర్మం మామూలు కన్నా పాలిపోయి ఉంటుందని తెలిపింది.

**పెదవుల మూలల్లో పగుళ్లు :**

పెదవుల మూలల్లో నొప్పిగా ఉండే పగుళ్లు లేదా చీలికలు ఏర్పడటాన్ని వైద్య పరిభాషలో 'యాంగ్యులర్ చైలిటిస్' అంటారు. ఇది విటమిన్ బి12 లోపంతో ముడిపడి ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పుండ్లు తరచుగా ఎర్రగా మారి, వాపు వస్తాయని అంటున్నారు. అలాగే ఆ ప్రాంతం పొడిబారడం లేదా పొట్టులా రాలడం వల్ల మాట్లాడేటప్పుడు లేదా తినేటప్పుడు తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయని అంటున్నారు. ఐరన్ లోపం లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా ఈ యాంగ్యులర్ చైలిటిస్ వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**నాలుక ఇలా చెబుతుంది! :**

విటమిన్ బి12 లోపం సంకేతాల్లో 'గ్లాసైటిస్' ఒకటని నిపుణులు చెబుతున్నారు. దీనినే నాలుక వాపు అంటారు. దీనివల్ల నాలుక ముదురు ఎరుపు రంగులోకి మారి.. నునుపుగా, మెరుస్తూ, వాచిపోయి, తాకితే నొప్పిగా లేదా సున్నితంగా ఉంటుందని అంటున్నారు. నాలుకపై ఉండే 'పాపిల్లే' అనబడే చిన్న చిన్న బుడిపెలు క్రమంగా మాయమైపోతాయని పేర్కొంటున్నారు. దీనివల్ల నాలుక సాధారణం కంటే చాలా నునుపుగా కనిపిస్తుందని తెలియజేస్తున్నారు. కొంతమందిలో నాలుక మంటగా అనిపించడం, ఆహారం మింగేటప్పుడు నొప్పి రావడం, కారంగా ఉండే పదార్థాలు తినలేకపోవడం, రుచి మారడం వంటి సమస్యలు కూడా ఎదురవుతాయని వివరిస్తున్నారు.

**తరచుగా వచ్చే నోటి పుండ్లు లేదా ఎర్రటి మచ్చలు :**

నోటిలో తరచుగా పుండ్లు రావడం లేదా నోటి లోపలి భాగంలో తగ్గకుండా ఉండే ఎర్రటి మచ్చలు కనిపించడం కొన్నిసార్లు విటమిన్ బి12 లోపాన్ని సూచించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పుండ్లు నాలుక, చిగుళ్లు, బుగ్గల లోపలి భాగం, పెదవులపై రావచ్చట. అప్పుడప్పుడు నోటి పూత రావడం సాధారణమే అయినప్పటికీ, పదే పదే రావడం లేదా త్వరగా మానకపోతే డాక్టర్లును సంప్రదించాలని సూచిస్తున్నారు. విటమిన్ బి12 లోపం వివిధ నోటి సంబంధిత లక్షణాలతో ముడిపడి ఉంటుందని పేర్కొంది.

**పచ్చని చర్మం లేదా కళ్లు :**

కొంతమందిలో విటమిన్ బి12 లోపం వల్ల స్వల్ప కామెర్లు రావచ్చుట. దీనివలన చర్మం లేదా కంటిలోని తెల్లసొన భాగం కొద్దిగా పసుపు రంగులోకి మారుతుందని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో ఎర్ర రక్త కణాలు సాధారణం కంటే వేగంగా విచ్ఛిన్నం అవ్వడం వల్ల ఇది జరుగుతుందని అంటున్నారు. దీనివలన రక్త ప్రవాహంలో 'బిలిరుబిన్' స్థాయిలు పెరుగుతాయని తెలియజేస్తున్నారు. విటమిన్ బి 12 లోపం వల్ల చర్మం, కళ్లు పసుపు రంగులో కనిపిస్తాయని పేర్కొంది.

**దృష్టి లోపాలు :**

విటమిన్ బి12 లోపం దీర్ఘకాలం పాటు కొనసాగితే అది తీవ్రమైన సమస్యగా మారి ఆప్టిక్ నరానికి (కంటి నుంచి మెదడుకు దృశ్య సమాచారాన్ని చేరవేసే నరం) నష్టం కలిగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల చూపు మసకబారడం, వస్తువులను స్పష్టంగా చూడలేకపోవడం, రంగులను గుర్తించడంలో ఇబ్బంది పడటం, బ్లైండ్ స్పాట్స్ వంటి లక్షణాలు కనిపించవచ్చని పేర్కొంటున్నారు. అయితే, ఈ సమస్యకు సకాలంలో చికిత్స తీసుకోకపోతే నరాలు దెబ్బతినడం అనేది శాశ్వత సమస్యగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, కంటి చూపులో ఎలాంటి స్పష్టమైన కారణం లేని మార్పులు కనిపించినా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలట.

**డాక్టర్?ను ఎప్పుడు సంప్రదించాలి? :**

ముఖం, కళ్లలో వచ్చే మార్పులు ఆధారంగా మాత్రమే విటమిన్ బి12 లోపాన్ని పూర్తిగా నిర్ధారించలేమంటున్నారు నిపుణులు. కానీ, ఈ లక్షణాలు సుదీర్ఘకాలం పాటు ఉంటూ.. వాటితో పాటు అలసట, బలహీనత, చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, సూదులతో గుచ్చినట్లు అనిపించడం, జ్ఞాపకశక్తి సమస్యలు లేదా నడిచేటప్పుడు బ్యాలెన్స్ తప్పడం వంటి సమస్యలు కూడా ఉంటే అసలు నిర్లక్ష్యం చేయవద్దని ంఊఅవఅఎవ ఎఆతీవషే పేర్కొంది. ఒక సాధారణ రక్త పరీక్ష ద్వారా శరీరంలోని విటమిన్ బి12 స్థాయిలను తెలుసుకోవచ్చని సలహా ఇస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# కామెర్లు చాలా డేంజర్! ఇలా చేయాలంటున్న నిపుణులు!

**జాండీస్ విషయంలో నిర్లక్ష్యం వద్దంటున్న నిపుణులు**

**సకాలంలో గుర్తిస్తేనే మేలని హెచ్చరిక!**



కామెర్లు అనేది చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారే ఒక పరిస్థితి. ఎర్ర రక్త కణాలు విచ్ఛిన్నమయ్యే సమయంలో ఉత్పత్తి అయ్యే 'బిలిరుబిన్' అనే పసుపు రంగు వర్ణద్రవ్యం శరీరంలో పేరుకుపోవడం వల్ల ఈ సమస్య వస్తుందని నిపుణులు చెబుతున్నారు. స్వల్పంగా ఉండే కామెర్లు కొన్నిసార్లు హానికరం కానప్పటికీ, ఎక్కువ కాలం ఉండే లేదా తీవ్రమైన కామెర్లు వైద్య సహాయం అవసరమయ్యే అంతర్గత ఆరోగ్య సమస్యలను సూచిస్తాయంటున్నారు. వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

**హెపటైటిస్ :**

కామెర్లు రావడానికి అత్యంత సాధారణ కారణాలలో హెపటైటిస్ ఒకటని ఎంఎ పేర్కొంది. ఇది హెపటైటిస్ ఌా,దీ లేదా జ వంటి వైరస్?ల వల్ల కాలేయానికి వచ్చే ఒక రకమైన వాపు అని నిపుణులు చెబుతున్నారు. ఈ ఇన్?ఫెక్షన్లు బిలిరుబిన్?ను ప్రాసెస్ చేసే కాలేయ సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తాయంటున్నారు. దీనివల్ల అది శరీరంలో పేరుకుపోతుందని వివరిస్తున్నారు. దీని లక్షణాలలో అలసట, వికారం, కడుపు నొప్పి, ముదురు రంగులో మూత్రం రావడం వంటివి కూడా ఉండవచ్చని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో లివర్ దెబ్బతినకుండా ఉండడానికి దీన్ని ముందస్తుగా గుర్తించడం, సరైన చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యమని సూచిస్తున్నారు.

**పిత్తాశయ రాళ్లు :**

పిత్తాశయంలో రాళ్లు (గాల్?స్టోన్స్) ఏర్పడటం లేదా పిత్తవాహికలలో అడ్డంకులు ఏర్పడటం వల్ల పిత్తరసం (బైల్) కాలేయం నుంచి బయటకు రాకుండా, జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించకుండా ఆగిపోతుందని నిపుణులు చెబుతున్నారు. దీని ప్రవాహానికి అడ్డంకి ఏర్పడినప్పుడు, బైల్? రక్తప్రవాహంలో పేరుకుపోయి కామెర్లకు దారితీస్తుందని అంటున్నారు. ఈ సమస్య ఉన్నవారిలో తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు, తెల్లటి లేదా లేత రంగు మల విసర్జన వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలియజేస్తున్నారు.

**మద్యపానం వల్ల వచ్చే కాలేయ వ్యాధి :**

అధికంగా మద్యం సేవించడం వల్ల కాలేయ కణాలు కాలక్రమేణా దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది ఆల్కహాలిక్ లివర్ డిసీజ్?కి దారితీస్తుందని అంటున్నారు. ఇది బిలిరుబిన్?ను సమర్థవంతంగా ప్రాసెస్ చేసే కాలేయ సామర్థ్యాన్ని తగ్గిస్తుందట. దీంతో బిలిరుబిన్ అనే పదార్థం శరీరంలో పేరుకుపోతుందట. దీంతో కామెర్లు వస్తాయని పేర్కొంది. అయితే, తీవ్రమైన సందర్భాల్లో కడుపు ఉబ్బరం, అలసట, గందరగోళం వంటి ఇతర లక్షణాలు కూడా తరచుగా కనిపిస్తాయట. అయితే, మద్యం సేవించడాన్ని తగ్గించడం, ముందస్తుగా డాక్టర్లును సంప్రదించడం వల్ల కాలేయం శాశ్వతంగా దెబ్బతినకుండా నిరోధించవచ్చని పేర్కొంటున్నారు.

**హీమోలిటిక్ అనీమియా :**


హీమోలిటిక్ అనీమియా అనేది శరీరంలో కొత్త ఎర్ర రక్తకణాలు తయారయ్యే వేగం కంటే, అవి వేగంగా విచ్ఛిన్నమవ్వడం లేదా నశించిపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుందట. దీనివల్ల శరీరంలో బిలిరుబిన్ స్థాయిలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది కామెర్లకు దారితీస్తుందని పేర్కొంది. ఈ సమస్య ఉన్నవారిలో ముదురు రంగు మూత్రం, అలసట, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి ఇతర లక్షణాలు కనిపించవచ్చుట.

**కాలేయ క్యాన్సర్ లేదా సిరోసిస్ :**

సిరోసిస్, కాలేయ క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు, లివర్ పనితీరును దెబ్బతీసి కామెర్లకు కారణమవుతాయంటున్నారు నిపుణులు. కాలేయానికి దీర్ఘకాలంగా జరిగే నష్టం వల్ల సిరోసిస్ వస్తుందట. ఇది కాలేయం?పై మచ్చలు ఏర్పడేలా చేసి కాలేయ పనితీరును క్షీణింపజేస్తుందని చెబుతున్నారు. అలాగే, కాలేయ క్యాన్సర్?, ట్యూమర్స్ పెరగడం వల్ల పిత్తరస ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ రెండు పరిస్థితులకు డాక్టర్ చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో బరువు తగ్గడం, కడుపు ఉబ్బరం, నిరంతర అలసట లాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దంటున్నారు. కాలేయ కణితికి మొదటి, కొన్నిసార్లు ఒకే ఒక్క సంకేతం కామెర్లు అని పేర్కొంది. కామెర్లు అనేది కేవలం బాహ్య రూపానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదట. ఇది నిర్లక్ష్యం చేయకూడని ఒక అంతర్గత ఆరోగ్య సమస్యకు సంకేతమంటున్నారు నిపుణులు. కాలేయ ఇన్?ఫెక్షన్లు నుంచి పిత్తవాహిక అడ్డంకుల వరకు దీనికి గల ముఖ్య కారణాలను అర్థం చేసుకోవాలని చెబుతున్నారు. అలాగే, ముందస్తు హెచ్చరికలను నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం.

# రూమ్ ఫ్రెషనర్స్ వాడుతున్నారా? ఈ విషయాలు తప్పక తెలుసుకోవాల్సిందేనట!

**పరిమళం చాటున ప్రమాదం - రూమ్ ఫ్రెష్?నర్స్ అతిగా వాడితే ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్న నిపుణులు!**



ఇంట్లో వాసన వస్తుందనో, బంధువులు వస్తున్నారనో, తాజా పరిమాళాలు వెదజల్లాలనో, ఇతర కారణాల వల్ల ఇళ్లలో రూమ్? ఫ్రెష్?నర్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. బయట మార్కెట్లో ఇవి రకరకాల ఫ్లేవర్లలో లభ్యమవటంతో గదుల్లోనే కాదు, వాహనాల్లోనూ విరివిగా వాడేస్తున్నారు. స్టోర్ రూమ్?, బాత్రూమ్?ల్లో ఎప్పుడో ఓ సారి వాడితే అంతగా ప్రభావమేమి ఉండదట. కానీ, రోజుల్లో ఎక్కువ సమయం గడిపే ప్రదేశాల్లో ఎక్కువగా వాడొద్దని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లో దొరికే కృత్రిమ పరిమళాలు తాత్కాలికంగా సుగంధం వెదజల్లినా దీర్ఘకాలం వాడితే వివిధ రకాల అలర్జీలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

**ఎన్నిరకాలో :**

స్ప్రే చేసేందుకు బాటిల్స్, వెలిగించేందుకు కొవ్వొత్తులు, అగరుబత్తీలు, గది ఉష్ణోగ్రత వద్దే సువాసన వెదజల్లే సాచెట్స్, ఉండలు, గ్రాన్యూల్స్, స్టిక్కర్లుగా ఇలా ఎన్నో రూపాల్లో మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ఇందులో స్ప్రే చేసేవి, వెలిగించే వాటితో పాటు అన్నీ ఆరోగ్యానికి హాని చేసేవే అని నిపుణులు చెబుతున్నారు.

**ప్రభావమేంటి? :**

ఫ్రెష్?నర్స్?లో థాలేట్స్ (సింథటిక్ రసాయన మిశ్రమం), అస్థిరమైన రసాయన సమ్మేళనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. కొన్ని లేబుల్స్?పై థాలెట్స్ బదులు ఐజ్రూ, ఐదీ్రూ, ప్లాస్టిసైజర్ అని తెలియజేస్తారట. అయితే, ఈ థాలెట్స్ కావాల్సిన ఫ్లేవర్ వాసనను అంటిపెట్టుకుని, ఎక్కువ సమయం సువాసన వచ్చేలా చేస్తాయని వివరిస్తున్నారు. చాలా ఫ్రెష్?నర్స్?లో మిథైల్ పారాబెన్, ప్రొపైల్? పారాబిన్, ఫార్మాల్డిహైడ్?లు వాడుతారట. ఇవి సుగంధం ఎక్కువ కాలం ఉండేందుకు ఇవి సహాయకారిగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. రూమ్ ఫ్రెష్?నర్ డబ్బాలలో బ్యూటేన్, ఐసో బ్యూటేన్, ప్రొపేన్ అనే రసాయనాలను వాడుతారని నిపుణులు చెబుతున్నారు. తుంపర్లుగా గది అంతా స్ప్రే అయ్యేందుకు ఇవి సహాయపడతాయని తెలియజేస్తున్నారు.

**ప్రభావం :**

ఇలాంటివి విషపూరితమని నిపుణులు చెబుతున్నారు. గాఢత ఎక్కువైతే ఊపిరాడదని అంటున్నారు. అలసట, వికారం అనిపిస్తుందని పేర్కొంటున్నారు. అంతేకాదు, వాణిజ్యపరమైన రూమ్ ఫ్రెష్?నర్?ల ప్రధాన ఫార్ములాలో క్రిమి సంహారకాలు, ఆక్సిడైజర్లు, అలర్జీ కారకాలు, శానిటైజర్లు, ఇతర రసాయనాలు శ్వాసకోశ, నాడీ సంబంధ సమస్యలు కలిగిస్తాయని ' అనే మూలికల ఆధారిత ఫ్రెష్?నర్ తయారు చేసినప్పుడు పుణె డీమ్డ్ వర్సిటీ వెల్లడించింది.

**దీర్ఘకాలిక సమస్యలు :**

ఎయిర్ ఫ్రెష్?నర్?లలో కొన్ని రకాలను పీలిస్తే కొందరికి వెంటనే తలనొప్పి, వాంతులు, కళ్లు తిరగడం వంటి సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. దీనివల్ల దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు తలెత్తొచ్చని హెచ్చరిస్తున్నారు. కాయిల్స్, అగరుబత్తీలు, రూమ్ ఫ్రెష్?నర్స్, ఎయిర్ ఫ్రెష్?నర్స్, టాయిలెట్ క్లీనర్లు.. ఏవైనా గాఢమైన వాసనను విడుదల చేస్తాయి. దీంతో ముక్కు కారడం, మండటం లాంటి సమస్యలు రావొచ్చు. వీటిని పట్టించుకోకపోతే దగ్గు, తుమ్ముల వరకు వెళ్తుంది. అయినా, వాడేస్తుంటే ఊపిరితిత్తుల్లోకి గాలి వెళ్లే ప్రధాన మార్గంలో సమస్య వస్తుంది. ఛాతీ భాగం బిగుతుగా, పిల్లికూతలు, ఆయాసం వస్తాయి. చాలామంది బయటకు వెళ్తేనే వాయు కాలుష్యం బారిన పడతామని అనుకుంటారు. కానీ,ఇంట్లో కృత్రిమ సుగంధాలతో వచ్చే సమస్యల గురించి పట్టించుకోరు. కృత్రిమ వాసనలను నియంత్రిస్తే 70 శాతం శ్వాస సమస్యలు తగ్గిపోతాయి- డాక్టర్ రమణ ప్రసాద్, పల్మనాలజిస్టు

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815